## క్లుప్తంగా

### గుండె వైద్య శిబిరం



ఏలేశ్వరంలో గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్న పాస్టర్లు

**ఏలేశ్వరం:** యార్లగడ్డ హైమావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు యార్లగడ్డ రాజాచౌదరి ఆర్థిక సాయంతో స్థానిక వేంకటేశ్వర ఫంక్షన్ హాలులో సుమారు 70 మంది పాస్టర్లకు గుండె పరీక్షలు చేశారు. గుండె సంబంధిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో జాన్‌విల్సన్, కె.మణికుమార్, అంద్రూస్, ఎలేజా, అమోస్, ఇమ్మానియేలు, విక్టర్‌రాజు, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభం



ప్రత్తిపాడులో ఇండోర్ షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రాజరాజేశ్వరి

**ప్రత్తిపాడు:** మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం సమీపాన ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును ఆదివారం ఆమె ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వ్యాయామానికి దోహదపడేలా జిమ్, ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేయడం ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రత్తిపాడు సీఐ కె. కిషోర్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్, కిర్లంపూడి యంగ్ మెన్స్ క్లబ్ చైర్మన్ పెంటకోట నాగబాబు, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల కన్వీనర్లు బెహరా దొరబాబు, దోమాల గంగాధర్, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

### ఐక్యతతోనే హక్కుల సాధన



ఏలేశ్వరంలో విజయోత్సవ ర్యాలీ చేస్తున్న క్వారీ కార్మికులు

**ఏలేశ్వరం:** కార్మికులు ఐక్యంగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చని ఉభయ గోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుప్పుల నాగభూషణం అన్నారు. స్థానిక క్వారీ కార్మిక భవనంలో ఆదివారం కార్మికులకు నూతన వేతన ఒప్పందంపై ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ యాజమాన్యంతో నూతన వేతన ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. కార్మికుల ఐక్యతతో గతంలో కంటే మెరుగ్గా ఒప్పందం కుదిరిందన్నారు. సబ్ కాంట్రాక్టర్‌కు టన్నుకి రూ.98, కార్మికుడికి రోజుకూలి రూ.875, సంక్రాంతికి రూ.5500 బోనస్ ఇచ్చేలా ఒప్పందం జరిగిందన్నారు. కార్మికులకు ప్రమాద బీమా రూ.8.5 లక్షలు, బీమా లేని సమయంలో ప్రమాదం జరిగితే మొత్తం నష్టపరిహారం యాజమాన్యం భరించేలా ఒప్పందం కుదరడంతో సమ్మెను విరమించామన్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దేరంగుల రాజు, బత్తుల రాజబాబు, నీలపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

**జగ్గంపేట:** గ్రామ శివారు పామాయిల్ తోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

### సుస్థిర లక్ష్యాల సాధనపై నేటి నుంచి శిక్షణ

**సామర్లకోట:** స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం నుంచి రెండు రోజు పాటు పూర్వపు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని టీఓటీలకు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సీనియర్ ఫ్యాకల్టీ ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. పేదరికం నిర్మూలనలో భాగంగా చేయవలసిన అంశాలపై సుస్థిర లక్ష్యాల సాధనపై శిక్షణ ఉంటుందన్నారు. ఇప్పటికే సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు దీనిలోకి వస్తాయని చెప్పారు. ఆయా జిల్లాలకు చెందిన జెడ్పీ సీఈఓలు టీఓటీలను ఎంపిక చేసి పంపనున్నారు. వీరిలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, మండల ఇంజినీరు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉంటాయన్నారు. శిక్షణ పొందిన వారు ఆయా జిల్లాల్లో తిరిగి శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు.

# అపరాలు అధరహో

- మినుము, పెసరకు మార్కెట్‌లో ఆశాజనకంగా ధర
- మెట్టలో ఆశించిన స్థాయిలో దిగుబడులు
- ప్రతికూల వాతావరణంతో ఆదరాబాదరాగా పంట ఒబ్బిడి



జగన్నాథపురంలో అపరాల పంట నూర్పిడి చేస్తున్న రైతులు

**కోటనందూరు:** నియోజకవర్గంలో ఈ ఏడాది అపరాల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. రైతులు పండించిన మినుము, పెసర పంటలకు మార్కెట్‌లో ఆశించిన ధర లభిస్తోంది. ఈ ఏడాది రెట్టింపు వర్షాలతో భూమిలో భారీగా తేమ ఉండడం, ఆది నుంచి వాతావరణం అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడులు వచ్చాయి. పైరుపై తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవంతో రైతులు తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధించారు. రేగడి భూముల్లో నాలుగు నుంచి ఐదు బస్తాల దిగుబడి వస్తే, మెట్ట ప్రాంతంలో రెండు నుంచి మూడు బస్తాల వరకూ దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. అపరాల పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**90 శాతం పంట ఒబ్బిడి**

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు అపరాల సాగు చేశారు. తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 10,318 ఎకరాల్లో పెసర, 9,785 ఎకరాల్లో మినుము సాగు చేసారు. వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాల ద్వారా ఎకరానికి రెండు నుంచి మూడు బస్తాల వరకూ దిగుబడి రానున్నట్లు గుర్తించారు. ఇప్పటికే రైతులు 90 శాతం పంటను ఒబ్బిడి చేసుకోగా ఆలస్యంగా కోతకొచ్చిన 10 శాతం పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

**రైతులకు కనీస మద్దతు ధర**

రైతులు రబీలో సాగు చేసిన అపరాలకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభిస్తోంది. గతంలో దళారి చెప్పిందే వేదం. అతను నిర్ణయించిందే ధర. దళారి మాటకు కట్టుబడే రైతు అపరాలు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. దళారుల ఆగడాలకు ప్రభుత్వం కళ్లెం వేసింది. రైతుల వ్యయ ప్రయాసలకు అనుగుణంగా పెసరకు రూ.7,275, మినుముకు రూ.6,600 చొప్పున కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ప్రభుత్వమే నిర్ణయించింది. మార్కెట్లో వ్యాపారులు సైతం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే రైతుల నుంచి అపరాలు కొనుగోలు చేస్తున్నారు.

**ఉరుకులు, పరుగులు**

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం కురుస్తుండడంతో అపరాలు సాగు చేసిన రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కొంతమంది రైతులు పొలాల్లో ఉన్న పంటను ఒబ్బిడి చేస్తుండగా మరికొంత మంది ఒబ్బిడి చేసిన పంటను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్నారు.

తుని సబ్‌డివిజన్ పరిధిలో అపరాల సాగు వివరాలు (ఎకరాల్లో..)

| మండలం | పెసర | మినుము |
|---|---|---|
| తొండంగి | 6042 | 3,235 |
| కోటనందూరు | 1830 | 2,255 |
| శంఖవరం | 343 | 590 |
| రౌతులపూడి | 425 | 2,528 |
| తుని | 1,678 | 1,178 |
| మొత్తం | 10,318 | 9,786 |



పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

**దిగుబడులు బాగున్నాయి**



అనుకూల వాతావరణం కారణంగా ఈ ఏడాది అపరాల దిగుబడులు బాగున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మినుము, పెసర రేటు కూడా ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వ్యాపారుల దోపిడీ లేకుండా పోయింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వ్యాపారులు అపరాలు కొనుగోలు చేస్తున్నారు. అపరాలతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

– అప్పలనాయుడు, రైతు, చిన్నయ్యపాలెం

### బాధితులకు చేయూత



ప్రత్తిపాడులో బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

**ప్రత్తిపాడు:** గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు స్థానిక శ్రీసత్యసాయి సేవా సమితి చేయూతనిచ్చింది. బాధిత కుటుంబాలకు ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి జోనల్ కన్వీనర్ కొమ్ముల జయబాబు, పి.నాగేశ్వరరావు, మట్టపర్తి లక్ష్మణకుమార్, ఎస్వీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఈబీ దాడుల్లో ఒకరి అరెస్టు

**ప్రత్తిపాడు:** స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఒకరు అరెస్టు కాగా మరొకరు పరారయ్యారు. స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం... ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన నిందితుడు గవసాని వీరబాబు పరారయ్యాడన్నారు. ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరంలో సారా విక్రయిస్తున్న బిల్లి త్రిమూర్తులును అరెస్టు చేసి, అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

## అకాల వర్షంతో ఆరుతడి పంటలకు మేలు



మరువాడలో అకాల వర్షంతో ఊపిరి పోసుకున్న ఆరుతడి పంటలు

**తుని రూరల్:** అల్పపీడనం ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా కురిసిన భారీ వర్షంతో మెట్టలో ఆరుతడి పంటలకు జీవం వచ్చింది. ఈ సంవత్సరం వేసవి ప్రారంభం నుంచి అధిక ఉష్ణోగ్రతలతో తడారిన ఆరుతడి పంటలు శనివారం, ఆదివారం కురిసిన భారీ వర్షంతో ఒక్కసారిగా ఊపిరి పోసుకున్నాయి. నియోజకవర్గంలో ఆదివారం ఉదయానికి 41.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి మెట్టలో సాగవుతున్న మిరప, టమాటా, ఇతర కూరగాయలు, ఆకుకూరలు, మొక్క జొన్న, మామిడి, జీడిమామిడి తోటలకు, రబీ వరిసాగు, అపరాల పంటలకు మేలు జరుగుతుందని తుని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. కాగా పలు గ్రామాల్లో కోత కోసి పనలపై ఉన్న అపరాల పంటలు తడిసిపోయాయి. మామిడి తోటలకు కొంత మేర నష్టం వాటిల్లుతుందని, మామిడి పిందెలు, కాయాలను పురుగులు ఆశించే అవకాశం ఉందని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. రైతులు అప్రమత్తమై తడిసిన పంటలను ఆరబెట్టాలని, పురుగులు, తెగుళ్ల సోకకుండా సచివాలయాల్లో వీఏఏ, వీహెచ్ఏల సలహాలు, సూచనలు రైతులు పాటించాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులు సూచించారు.

## తీరంలో అలజడి



కొత్త చోడిపల్లిపేట తీరంలో ఎగసిపడుతున్న అలలు

**తొండంగి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. మండలంలోని దానవాయిపేట, అద్దరిపేట, పెరుమాళ్లపురం, కొత్త చోడిపల్లిపేట సముద్ర తీరాల్లో అలలు రెండు మీటర్లు ఎత్తు వరకూ ఎగసిపడుతున్నాయి. ప్రతికూల వాతావరణం కారణంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు. తుపాను ప్రభావంపై తీర గ్రామాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేశామన్నారు. మత్స్యకారులు సముద్రంలో లంగరు వేసిన బోట్లును తీరాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారే వరకూ తీర గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్టు ఎంపీడీఓ పసుపులేటి సతీష్ తెలిపారు.

**భారీ వర్షం**

మండలవ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు విడతలుగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.

**వీడని వాన**

**శంఖవరం:** మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఆదివారం వర్షం కురిసింది. అల్పపీడనం ప్రభావంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. ఈదురుగాలులకు అచ్చంపేట, ఎస్.జగ్గంపేట, జి.కొత్తపల్లి, గవిరంపేట గ్రామాల్లోని అరటి తోటలు కొంతమేర దెబ్బతిన్నాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది.



పెరుమాళ్లపురంలో ఒడ్డుకు చేర్చిన బోట్లు





కత్తిపూడిలో రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

## ముగిసిన వెంకన్న ఆలయ వార్షికోత్సవాలు



దానవాయిపేటలో స్వామివారికి హోమం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

**తొండంగి:** మండలంలోని దానవాయిపేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఐదు రోజల పాటు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించారు. వేదపండితులు అగ్నిహోత్రం రంగాచార్యులు, శుంకరణం వెంకట్రాజుశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు స్వామివారికి నవగ్రహారాధన, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామివారి కల్యాణోత్సవం, గ్రామోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఆలయం వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, జెడ్పీ వైస్‌చైర్మన్ మేరుగు పద్మలత దంపతులు, పార్టీ నాయకులు మడదా పరమేశ్వరరావు, సర్పంచ్ మడదా తిరుమల కుమారి దంపతులతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## రోటరీ చేయూత అభినందనీయం



రోటరీ చేయూత భవనాన్ని ప్రారంభిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి

**బోట్‌క్లబ్:** ఖాళీగా ఉన్న రోటరీ భవనాన్ని చేయూత సంస్థ నిర్వహణకు ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమని ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. రోటరీ చేయూత భవన్‌ను ఆదివారం శేషారెడ్డి ప్రారంభించారు. చేయూత సంస్థలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు భవనం చేకూర్చడమే కాక వారి యోగక్షేమాలు పర్యవేక్షించేందుకు నిరంతరం రోటరీ సభ్యులు సహాయసహకారాలు అందిస్తామనడం రోటరీ సభ్యుల సేవా భావానికి నిదర్శనమన్నారు. నూతన భవన నిర్మాణానికి తన వంతు రూ. 50 వేలు విరాళాన్ని అందిస్తానని శేషారెడ్డి ప్రకటించారు. రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ చేయూత సంస్థకు రోటరీ బ్లడ్‌బ్యాంకు ఆధీనంలో ఉన్న హెల్త్‌కేర్ సెంటర్‌ను మూడేళ్లపాటు వినియోగించుకునేందుకు క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. చేయూత సంస్థ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం సంస్థను ఏర్పాటు చేశామని తనకు సహాయ సహకారాలు అందిస్తున్న శేషారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ మాజీ గవర్నర్లు ఎస్వీఎస్‌రావు, సభ్యులు వడ్డాది ఆదిత్య, చార్మినార్ వర్మ, ముత్తా నవీన్, ధనసాగర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

**తుని రూరల్:** కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న మండల పరిధిలోని గ్రామాల్లో నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీల ఆధ్వర్యాన ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.అన్నవరం, రేఖవానిపాలెం, హంసవరం, తేటగుంట, వి.కొత్తూరు, డి.పోలవరం, టి.తిమ్మాపురం, వల్లూరు, ఎస్ఎస్‌వీ నగరం, దొండవాక తదితర గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారి జాతరోత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆయా గ్రామాల్లో నూకాలమ్మ తల్లి విగ్రహాలకు, ఆలయాలకు రంగులు వేశారు. విద్యుత్ దీపాలంకరణలు, దేవతామూర్తుల భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి దర్శనాలకు క్యూలైన్లు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నారు. జాతరోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై ఎ.బాలాజీ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

**నేడు నూకాలమ్మ జాతర**

**ఏలేశ్వరం:** మండలంలోని లింగంపర్తి గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా దూబచర్ల వారితో కాళీమాత, నవదుర్గ శక్తివేషాలు, రాజమహేంద్రవరం వారితో అబ్రకదబ్రా మ్యాజిక్ షో, గుంటూరు వారితో హిమ దేవతా విగ్రహాలు, వేట్లపాలెం వారితో బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. ఈ నెల 21న అమ్మవారి తీర్థం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయకమిటీ తెలిపింది.

**నూకాలమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు**

**కిర్లంపూడి:** కొత్తఅమావాస్య సందర్భంగా కిర్లంపూడిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్ల వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గత నెల రోజులుగా గ్రామ వీధుల్లో గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

**అమ్మవారికి సారె సమర్పణ**

కిర్లంపూడి ఏనుగు వీధిలో వేంచేసిన కన్యాకా పరమేశ్వరి ఆలయం నుంచి ఆదివారం భక్తులు ఊరేగింపుగా వచ్చి నూకాలమ్మ అమ్మవారికి సారె సమర్పించారు.



కిర్లంపూడిలో పిల్లల కోసం సిద్ధం చేసిన బ్రేక్ డ్యాన్స్ యంత్రం



లింగపర్తిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారు



ఎస్.అన్నవరంలో ఏర్పాటు చేస్తున్న 50 అడుగుల భారీ హోర్డింగు

### ఉగాది ఉత్సవ పోటీలు ప్రారంభం



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

**సామర్లకోట:** స్థానిక సకల కళాస మాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద గ్రంథాలయంలో ఉగాది ఉత్సవ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సినీ దర్శకుడు కేబీ ఆనంద్ ప్రారంభించారు. ఉగాది సంబరాలకు సంబంధించి కూచిపూడి, భరతనాట్యం, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం, కోలాటం, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. వీరి నుంచి మూడు బృందాల చొప్పున ఎంపిక చేసి ఉగాది రోజు సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో తిరిగి ప్రదర్శనలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్టు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సకల కళా సమాఖ్య అధ్యక్షుడు బడుగు బాబీ, కార్యదర్శి జి.రాజు, కోశాధికారి ఎ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడిరత్నం, మార్ని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తే కఠిన చర్యలు

- హోటల్ యజమానులకు డీఎస్పీల హెచ్చరిక

**కాకినాడ క్రైం:** అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులను పోలీసు అధికారులు హెచ్చరించారు. కాకినాడ పోలీసులు హోటల్, లాడ్జిల యజమానులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కాకినాడ లా అండ్ ఆర్డర్, క్రైం డీఎస్పీలు మురళీకృష్ణారెడ్డి, రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు రూంలు కేటాయిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని, నిర్ణీత సమయాలకు లోబడి తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. వాణిజ్య సముదాయాలన్నింటిలోనూ సీసీటీవీ కెమేరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.